## వైఎస్సార్‌సీపీ 'ఫీజు పోరు'ను జయప్రదం చేయండి

**- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, యువ నాయకుడు వై.భీమరెడ్డి**

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు వై.భీమరెడ్డి

విద్యార్థుల పక్షాన అండగా నిలుస్తూ చంద్ర బాబు సర్కార్‌పై నిరసన గళం విప్పడంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 5వ తేదిన జరుగనున్న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు కార్యక్రమానికి విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి పెద్దఎత్తున తరలిరావాలని ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వై.భీమరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వారు స్థానిక విలేఖరులతో మాట్లాడారు. బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రం అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్దగల దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుండి ఫీజు పోరు ర్యాలీ కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ కొనసాగుతుందన్నారు. నాలుగు త్రైమాసికాలుగా బకాయి పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన 3,900 కోట్ల రూపాయలను తక్షణం విడుదల చేయాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 37వేల పైచీలకు పాఠశాలలను మనబడి నాడు-నేడు కింద ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లించలేదని ఈ మోసకారి ప్రభుత్వం కళ్ళు తెరిపించి విద్యార్థులకు న్యాయం చేయించేందుకు ఫీజుపోరు జరుగుతోందన్నారు. విద్యార్థులు వారితల్లిదండ్రులతోపాటు వైఎస్సార్‌సీపీశ్రేణులు పెద్దఎత్తునతరలిరావాలని ఈసందర్భంగా పిలుపునిచ్చారు.

## ఘనంగా ప్రారంభమైన కొల్హాపురి మహాలక్ష్మి వేడుకలు

అగళి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

మండల పరిధిలోని హనుమనపల్లి గ్రామంలో కొల్హాపురి మహాలక్ష్మి వేడుకలను మూడు రోజులపాటు నిర్వహిస్తారు. మొదటి రోజు సోమవారం పక్కనున్న రత్నగిరి గ్రామంలో వెలిసిన కొల్హాపురి మహాలక్ష్మి దేవిని ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో వేధ మంత్రోచ్చారణలతో, డప్పు వాయిద్యాలతో, వివిధ రకాల పూలతో అలంకరించిన దేవిని సోమవారం రోజు హనుమనపల్లి గ్రామానికి పిలుచుకువచ్చారు. మూడు రోజులపాటు ఉత్సవాలను వేడుకలను ఘనంగా నిర్వహించడానికి భక్తులు అంతా సిద్ధం చేసుకున్నారు. సోమవారం రాత్రి నుంచి కొల్హాపురి మహాలక్ష్మికి పూజలు ప్రారంభమవుతాయి. గ్రామం మొత్తం మహాలక్ష్మికి ఇష్టమైన చలువ పిండితో చేసిన బియ్యం, బెల్లంతో తయారు చేసిన హారతులకు, వేపాకులతోపాటు గన్నేరు పువ్వులను అలంకరించి దీపాలను గ్రామం మొత్తం నిర్వహిస్తారు. దేవి కూర్చున్న చోటుకు మూడు ప్రదక్షిణలు చేసిన అనంతరం గన్నేరు పూలను, వేపాకులను ప్రదేశంలో వేయడం ఆనవాయితీ. అనంతరం దేవికి ఘనంగా మంగళహారతి, అభిషేకాలను పూర్తి చేస్తారు. బంధువులకు, చుట్టుపక్కల గ్రామాలకు విందుబోజనం ఏర్పాటు చేస్తారు.

## మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 5న చివరిరోజు

**- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవిచంద్ర**

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఆర్.రవిచంద్ర

రాష్ట్ర ప్రభుత్వం గీత ఉప కులస్తులకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందని ఆశావహులు ఆన్‌లైన్, ఎక్సైజ్ స్టేషన్లలోని దరఖాస్తు స్వీకరణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉరవకొండ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవిచంద్ర తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. ఆశవహులు సబ్ క్యాస్ట్, నేటివిటీ సర్టిఫికేట్లను సంబంధిత తహశీల్దార్ కార్యాలయం నుండి పొంది దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. గీత కులాలకు ప్రభుత్వం జిల్లాలో 14 మద్యం దుకాణాలను కేటాయించిందని వారికి కేటాయించిన మద్యం దుకాణాలకు లైసెన్సు ఫీజులో 50శాతం రాయితీ కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని గీత కార్మిక ఉప కులాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఏవీఆర్ పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

**- భక్తిశ్రద్ధలతో కొనసాగిన సరస్వతి పూజా కార్యక్రమాలు**

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త




విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రిన్సిపాల్ విక్రమ్‌బాబు తదితరులు

పట్టణంలోని ఏవీఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం మాఘ మాస వసంత పంచమి సోమవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్ విక్రమ్ ఆధ్వర్యంలో వేదపండితులు పవన్ చదువుల తల్లి సరస్వతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రిన్సిపాల్ విక్రమ్ విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవ్వరూ దొంగలించలేనిది చదువొక్కటేనని తల్లిదండ్రులు తమ పిల్లలందరినీ తప్పక చదివించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలన్నారు. చదువుకు వయసు, వర్ణ, వర్గ బేధాలు ఉండవని ప్రతి ఒక్కరూ అక్షర జ్ఞానం కలిగి ఉండాలని విక్రమ్ పిలుపునిచ్చారు.

## గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ అనంతపురంలో బాధ్యతాయుత గేమింగ్‌పై కార్యగారం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా.పద్మశ్రీ

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బాధ్యతాయుత గేమింగ్‌పై కార్యాగానం (వర్క్‌షాప్) సోమవారం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.పద్మశ్రీ మాట్లాడుతూ.. విద్యార్థులను మోసపూరిత గేమింగ్ వెబ్ సైట్‌ల నుంచి రక్షించేందుకు, వారిని ఆన్లైన్ మోసాల నుంచి కాపాడేందుకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు తెలిపారు.

## కమనీయం భద్రావతి భావనాఋషీంద్రుల కళ్యాణోత్సవం

**- వైభవంగా స్వామివార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు**

**- భక్తిశ్రద్ధలతో భక్తమార్కండేయస్వామి జయంతి**



భద్రావతి భావనాఋషీంద్రుల కళ్యాణోత్సవం జరుగుతున్న దృశ్యం

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



భద్రావతి భావనాఋషీంద్రుల ఉత్సవమూర్తులు

పట్టణంలోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం మాఘమాసం పంచమి సోమవారం భద్రావతి భావనాఋషీంద్రుల కళ్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. భక్త మార్కండేయస్వామి జయంతి మహోత్సవం (21వ వార్షికోత్సవం) సందర్భంగా ఉదయం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో శోభాయమానంగా తీర్చిదిద్దిన స్వామివార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ పట్టణంలో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోశ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ భద్రావతి భావనాఋషీంద్రుల కళ్యాణోత్సవం కొనసాగింది. కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున తరలిరాగా మధ్యాన్నం అన్నదాన కార్యక్రమ జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మశాలి, తొగటవీర క్షత్రియ, దేవాంగ, కుర్ని సామాజిక వర్గాలకు చెందిన వారితోపాటు భక్తులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికకు స్థలం కేటాయించండి

**డిప్యూటీ తహశీల్దారును కోరిన ఆర్యవైశ్యులు**

గుడిబండ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

మండల కేంద్రం పరిసరాల్లో ఆర్యవైశ్యుల స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని మండలంలోని ఆర్యవైశ్య సంఘం సభ్యులు డిప్యూటీ తాహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న ఆర్యవైశ్యులు స్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారుల స్పందించి ఆర్యవైశ్యులకు స్మశాన వాటిక కు స్థలం కేటాయించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కృష్ణమూర్తి రవికుమార్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

## మర్రి మేకల పల్లిలో బిజెపి నాయకుని వ్యవసాయ పనిముట్లు ధ్వంసం

**బాధిత రైతును పరామర్శించిన మంత్రి కార్యాలయం ఇంచార్జ్ హరీష్ బాబు**

తాడిమర్రి ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త)



బాధిత రైతుని పరామర్శిస్తున్న హరీష్ బాబు

మండల పరిధిలోని మర్రిమేకలపల్లి గ్రామానికి చెందిన బిజెపి నాయకులు మల్లా గుండ్ల మల్లన్న కు చెందిన వ్యవసాయ పనిముట్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆఫీస్ ఇంచార్జ్ హరీష్ బాబు సోమవారం మర్రివేకలపల్లి గ్రామాన్ని సందర్శించి బాధిత రైతు మల్లన్నను పరామర్శించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కూడా సంబంధిత రైతుకు చెందిన చీని చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేయడంతో తీవ్రంగా నష్టపోయరని ప్రస్తుతం వేరుశనగ పంట సాగు నిమిత్తం నిల్వ చేసుకున్న 30 పైపులు, 14 స్ప్రింక్లర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం దుర్మార్గమని ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బిజెపి కార్యకర్తకు ఇలా జరగడం చాలా బాధాకరంగా ఉందని రైతు మల్లన్నకు తగిన న్యాయం చేస్తామని హరీష్ బాబు అన్నారు. వీరికి జరిగిన అన్యాయం మరి ఏఒక్క బిజెపి కార్యకర్తకు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంపై వెంటనే డిఎస్పీకి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. రైతుకు నష్టం కలిగించిన వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు .ఈ కార్యక్రమంలో మండల బిజెపి కన్వీనర్ దేవర రాము బిజెపి నాయకులు కొంక నాగార్జున కత్తి నాగభూషణం అరవేటి ఆనంద్ తో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రైవర్ ఫ్యామిలీకి ఆర్థిక సాయం అందచేసిన తోటి డ్రైవర్లు

**-మృతి చెందిన డ్రైవర్ కుటుంబానికి రూ.25 వేలు అందించిన గోరంట్ల మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్**



ఆర్థిక సాయం అందచేస్తున్న తోటి డ్రైవర్లు

గోరంట్ల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

గోరంట్ల పట్టణంలోని డ్రైవర్ ఫరీద్‌ఖాన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో పట్టణంలోని మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫరీద్‌ఖాన్ కుటుంబానికి ఆర్థిక సాయం అందచేసి తోటి డ్రైవర్‌పై వారికున్న మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని వినాయకనగర్‌లో ఇటీవల మృతి చెందిన డ్రైవర్ ఫరీద్‌ఖాన్ నివాసంలో కుటుంబసభ్యులకు యూనియన్ అధ్యక్షులు జక్రియఖాన్, ఉపాధ్యక్షులు నారాయణస్వామి, ట్రెజరర్ కసిరెడ్డిపల్లి గంగాధర్, నూర్‌మహమ్మద్, తదితరుల ఆధ్వర్యంలో 25 వేల రూపాయల నగదు అందచేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సద్దాం, రమణ, నాగరాజు, హిదయతుల్లా, ఆచారి, బాష, తదితరులు పాల్గొన్నారు.

## భేటీ బచావో భేటీ బచావో భేటీ పఢావో పై అవగాహన సదస్సు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రాయదుర్గం, ఫిబ్రవరి 03 ప్రభాతవార్త:

దేశంలో లింగ వివక్ష మరియు మహిళా సాధికారత కొరకు భాతవ ప్రభుత్వం బేటీ బచావో-బేటీ పఢావో పథకాన్ని ప్రవేశపెట్టిందని, లింగ పక్షపాతానికి వ్యతిరేకంగా పౌరులకు అవగాహన కల్పించడం మరియు బాలికల సంక్షేమ సేవల సామర్థ్యాన్ని మెరుగు పరచడం ఈ పథకం ముఖ్యలక్షణమని ఆరోగ్య విధ్యాబోదకులు లక్ష్మీనారాయణ, మలేరియా సబ్‌యునిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్ తెలియజేశారు. స్వచ్ఛ రాయదుర్గంలో భాగంగా రాయదుర్గం అర్బన్ పరిధిలోని కోట విధీ 13వ సచివాలయం పరిధిలో భేటీ బచావో-భేటీ పదావో పై అవగాహన మరియు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ బాలిక విద్యపై దృష్టి సారించి చదువు కొన్నప్పుడే సమాజంలో మార్పు సాధ్యమని బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థం వివరించారు. ఆడ శిశువు లేకుంటే సృష్టి ఉండదని, లింగ వివక్షత కూడదని తెలియజేశారు. గర్భస్థ పిండ లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని పిండ లింగనిర్ధారణ పరీక్షలు చేసిన వారికి అందుకు ప్రోత్సహించిన వారికి రూ.10,000 జరిమాన, 3సంవత్సరాల పాటు ఖైదు శిక్ష పడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శాంతకుమారి, లక్ష్మీనరసమ్మ, శానిటేషన్ సెక్రెటరీలు ఆరుణ, సునీత, సుజాత, శైలజ, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, సునీత, సుబ్బలక్ష్మీ, స్వాతి, శారద తదితరులు పాల్గొన్నారు.

## రొద్దం చిన్న చెరువు మరమ్మతుల కోసం ప్రతిపాదనలు

**పరిశీలించిన ఇరిగేషన్ శాఖ ఏఈ సాగునీటి సంఘం అధ్యక్షుడు.**

రొద్దం. ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

రొద్దం చిన్న చెరువు కాల్వగట్లు చెరువు గట్టు తూముల ను సోమవారం ఇరిగేషన్ శాఖ ఏఈ వినోద్ సాగునీటి సంఘం అధ్యక్షుడు పి కృష్ణప్ప స్థానిక దేశం నాయకులు పరిశీలించారు. చెరువు కాలువగట్లు చెరువు కట్ట పాడైపోయిన తూములను పరిశీలించి వాటి మరమ్మత్తుల కోసం దాదాపు కోటి రూపాయల వరకు ప్రతిపాదనలు తయారు చేస్తామని ఇరిగేషన్ అధికారి తెలియజేశాడు రొద్దం గ్రామానికి చెందిన ఒక రైతు చెరువుకు సంబంధించిన భూమిని ఆక్రమించుకొని మొక్కజొన్న పంటను సాగు చేశారని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈరోజు చిన్న చెరువును పరిశీలించి మరమ్మత్తుల కోసం ప్రతిపాదనలు పంపించడం బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ చలువే అని డీలర్ల సంఘం అధ్యక్షుడు పి సిద్ధన్న చరవాణి ద్వారా తెలియజేశాడు రెండు నెలల క్రితమే పెన్నల్ల పండుగ కార్యక్రమంలో చిన్న చెరువు మరమ్మత్తుల పనులను మంత్రి దృష్టికి తీసుకుపోయామని ఈ రోజు అధికారులు నాయకులు పరిశీలించి ప్రతిపాదనలు పంపడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో వీరాంజనేయులు అక్బర్ చంద్ర ఆదిశేషు చెన్నకేశవ నాగ కనుమప్ప రైతులు పాల్గొన్నారు.

## ఎస్కేఆర్ క్లబ్ ఉపాధ్యక్షులు, కార్యదర్శికి ఘన సన్మానం



క్లబ్ ఉపాధ్యక్షులు సి.ఎర్రిస్వామినాయుడు కార్యదర్శి సి.రవీంద్రనాథ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీ కరిబసవస్వామి రిక్రియేషన్ క్లబ్ ఉపాధ్యక్షులు సి.ఎర్రిస్వామి నాయుడు, కార్యదర్శి సి.రవీంద్రనాథ్ కు ఘన సన్మానం జరిగింది. సోమవారం రాత్రి క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మార్నింగ్ వాకర్స్, పలువురు ప్రముఖులు ఇరువురిని శాలువాలు కప్పి పూలమాలలో సన్మానించారు. జనవరి 26వ తేదీన క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికకాగా కార్యవర్గ బాధ్యులు ఫిబ్రవరి 1వ తేదీ నుండి బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పురుగులమందు సేవించి వ్యక్తి ఆత్మహత్య

యాడికి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



ఆత్మహత్య చేసుకున్న వెంకటరాముడు

మండలంలోని నిట్టూరు గ్రామానికి చెందిన వెంకటరాముడు (55) అనే వ్యక్తి పురుగులమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం వెంకటరాముడు పురుగుమందు సేవించి పెద్దపేట విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పడివుండడంతో స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా యాడికి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఆయన ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి వుంది.

## దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీపై విచారణ చేయాలి

**- విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ**

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీలో జరిగిన అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి హెచ్ పెద్దన్న, ఎమ్మార్పిఎస్ నేత స్మామాట్ కె.మధు మాదిగ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఏడాది బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారిలో చాలా మంది ఫేక్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకున్నారని, ఈ విషయాన్ని గత జిల్లా కలెక్టర్ గౌతమి, సంబంధిత అధికారులను కలిసి ఫిర్యాదు చేశారన్నారు. దీనిపైన విచారణ చేసిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు జానకి రామయ్య, కళ మండలి జిల్లా అధ్యక్షులు పుల్లన్న, మహిళ అధ్యక్షురాలు జయమ్మ, మహిళ కమిటీ నాయకురాలు వరాలమ్మ, హుస్సేన్ బి.ఈశ్వరమ్మ, కళావతి, ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, బాలరాజు, కృష్ణమూర్తి, విహెచ్‌పిఎస్ నగర కార్యదర్శి చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 5న అనంత హార్టికల్చర్ కాంక్లేవ్

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్**



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం సాయంత్రం అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5వతేదీన అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నగరంలోని బళ్లారి రోడ్డులో వున్న ఎంవైఆర్ కన్వెన్షనల్ హాల్‌లో ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. దీని ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతపురం జిల్లాను ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా పిలుస్తామని ఇక్కడ ఉద్యాన పంట సాగుకు విపరీతమైన అవకాశం వుందన్నారు. ఇక్కడి నుండి పండిస్తున్న అరటి విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని, జిల్లాలో 1,04,021 హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయని దాదాపు 25.96 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పాదకత వుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నుల శాఖామంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్‌శాఖమంత్రి టిజి భరత్ వర్చువల్‌గా పాల్గొంటారన్నారు. ఇప్పటికే జాతీయస్థాయిలో 64 కంపెనీలో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలియచేశారని ఇందులో 6 పరస్పర ఒప్పందాలు తీసుకుంటున్నామన్నారు. మనకు అవసరమైన ఎరువులు, పురుగు మందుల వాడకం లాంటి వాటికి సంబంధించి ఒప్పందాలు వుంటాయన్నారు. జిల్లాని అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని స్వర్ణ అనంతపురం 2047లో భాగంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్‌ఓ ఏ.మలోల, హార్టికల్చర్ డిడి నరసింహారావు, వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, డిటిడబ్ల్యుఒ రామాంజనేయులు, హార్టికల్చర్ అధికారి పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు




మాట్లాడుతున్న ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్

అనంతపురం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త బ్యూరో

కార్మికచట్టాలు అమలు చేయాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. సోమవారం నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఏఐటియుసి జిల్లా సమితి సమావేశంజిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి రావులపల్లిరవీంద్రనాథ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమానికి నయాపైసా కేటాయించకుండా మోసం చేసిందన్నారు. ఇప్పటికే 44 కార్మిక చట్టాలను సవరణలు చేసి నాలుగు లేబర్‌కోడ్లను తీసుకొచ్చి కార్మికులకు ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కార్మికులు, ఉద్యోగుల ఏ ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదన్నారు. అధికారంలోకి రాక మునుపు కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని చెప్పి హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్, మంత్రి నారాలోకేష్‌లకు ఎన్ని వినతి పత్రాలు ఇచ్చిన అన్ని బుట్ట దాఖలవుతున్నాయన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పున ప్రారంభించి పెండింగ్‌లో ఉన్న క్లైములు వెంటనే ఇవ్వాలన్నారు. అసంఘటిత కార్మికులు హమాలి, ఆటో వీధి విక్రయదారులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లాప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల ఉద్యోగుల సమస్యలుపరిష్కరించే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ పిఆర్‌సి కమిటీని వెంటనే వేయాలన్నారు. కార్మికుల సమస్యలపై అవగాహన కోసం అనంతపురంజిల్లా స్థాయి శిక్షణా తరగతులు ఈ నెల 22, 23, 24 తేదీలలో జరుపుకొని భవిష్యత్ కార్యచరణను రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణుడు, జిల్లా ఉపాధ్యక్షులు గోవిందు,నాగవేణి, శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిలు చిరంజీవి, రాజు, శ్రీనివాసులు, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## సాయివిజ్ఞాన్ పాఠశాలలో వసంత పంచమి, అక్షరాభ్యాసం వేడుకలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యాలు

స్థానిక మూడవ రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో శుద్ధి పంచమి రోజున వసంత పంచమి జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎం.పి.శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.లావణ్య రామ్ కార్యక్రమంలో పాలుపంచుకొని వారి చేతుల మీదుగా సరస్వతి మాత పూజను జరిపి ఈ పవిత్రమైన రోజువిద్యార్థులకు మంచిజరగాలని కొత్తగాపాఠశాలకువెళ్లే పిల్లలకు అక్షరాభ్యాసం చేసి ఆ సరస్వతి దేవి ఆశీర్వాదాలు అందజేయాలని ఆ దేవిని దీప, ధూపాలతో ఎంతో ఘనంగా పూజ జరిపించడం కన్నుల విందుగా ఉంది.

## వసంత పంచమి సందర్భంగా మోక్షిత్ పాఠశాలలో అక్షరాభ్యాసం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

వసంత పంచమి సందర్భంగా శ్రీశిర్డిసాయి మోక్షిత్ స్కూల్‌లో అక్షరాభ్యాసం మహోత్సవం కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి, హెచ్‌ఎం వై.లక్ష్మీనారాయణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 50 మంది చిన్నారులతో వేద పండితుల మంత్రోచ్చారణలతో సరస్వతీ పూజ చేయించి పలక బలపం ఇచ్చి అక్షరాభ్యాస కార్యక్రమం, అన్న ప్రసాదాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## మంత్రి సవితను విమర్శించడం సబబు కాదు

### మాజీమంత్రి శంకర్ నారాయణ పై తెదేపా నాయకులు ఫైర్

పెనుకొండ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తేదేపా పట్టణ కన్వీనర్ శ్రీరామ యాదవ్

రాష్ట్ర మంత్రి సవిత పై మాజీ మంత్రి శంకర్ నారాయణ భలే విమర్శలు చేయడంపై తెదేపా నాయకులు ఆయనపై ఫైర్ అయ్యారు. మంత్రి సవితను విమర్శించడం సబబు కాదన్నారు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం నాయకులు శ్రీరామ్ యాదవ్ కేశవయ్య శ్రీనివాసులు తివేంద్ర నంజుండ లు పాల్గొన్నారు వైసీపీ పాలనలో హంద్రి నీవా కాలవలను మరమ్మత్తులు చేయకపోవడం వల్లనే కాలువలు అద్వాన స్థితికి చేరుకున్నయన్నారు పలుచోట్ల గండ్లు పడి కాలువలు తెగిపోయాయన్నారు కాలవలు పూర్తిగా ధ్వంసం కావడం వల్ల చెరువులకు మీరు అందించలేకపోతున్నామన్నారు ఈ విషయాన్ని మాజీ మంత్రి శంకర్ నారాయణకు తెలియక మాట్లాడుతున్నారన్నారు. శంకర్‌నారాయణ ప్రస్తుతం అనంతపురం పార్లమెంట్ ఇంచార్జిగా ఉన్నారని ఇక్కడ పరిస్థితులు తెలియని దుయ్యబట్టారు అనంతపురం పార్లమెంట్ పరిధిలో ఆయన పాచికలు పారవని తెలిసి పెనుకొండలో రాజకీయం చేయాలని చూస్తున్నారన్నారు మీ పార్టీ అధిష్టానమే నీపై నమ్మకం లేక నిన్ను అనంతపురం కు పంపిన విషయం మరిచిపోవద్దని గుర్తు చేశారు మంత్రి సవిత ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నియోజకవర్గంలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు విమర్శలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ఆయనకు వారు హితవు చెప్పారు నీవు మంత్రిపై విమర్శలు చేసినంత మాత్రాన పెనుగొండలో నీకు సీటు దక్కదని వారు గుర్తు చేశారు మీ పార్టీలోనే నీకు గుర్తింపు లేదని వారు ఘాటుగా విమర్శించారు. నియోజకవర్గం సమన్వయకర్తగా కూడా నియమించుకోలేకపోవడం నీ అసమర్థకు నిదర్శనమని తెలిపారు.

## వైభవంగా కెంచమాంబ దేవి జలది ఉత్సవాలు

అమరాపురం జనవరి 3ప్రభాతవార్త



జలది ఉత్సవాలు దృశ్యం

మండల పరిధిలో ఉదుగూరు గ్రామంలో వెలసిన కుంచిటిగ సోమేశ్వర వాళ్ళి జానకల్లు గోత్రానికి చెందిన ఆరాధ్య దైవం శ్రీ కెంచమాంబ దేవి పెద్ద యాత్ర ఉత్సవాలు సందర్భంగా సోమవారం జలది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణం నుండి గ్రామసమీపంలోని ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకెళ్లి జలది ఉత్సవాలను వేలాది భక్తుల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా పెద్దఎత్తున ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా కెంచమాంబ సేవాసమితి సభ్యులు సిద్దేశ్వర గౌడ్ ,గోవర్ధన్, మూర్తణ్ణప్ప, శివకుమార్, వీరలింగప్ప, చంద్రశేఖర్ గౌడ్ ,ప్రకాష్, జికుమార్,వీరలింగప్ప, శివకుమార్, లింగరాజు ,హనుమంతరాయప్ప లు మరియు దేవాలయానికి సంబంధించిన అర్చకులు దేవాలయ యజమానులు ఈ కార్యక్రమం ఏర్పాట్లుచేశారు.

## వైభవంగా శ్రీకరియమ్మ, వీర అజ్జణ్ణ జలది ఉత్సవాలు

అమరాపురం జనవరి 3ప్రభాతవార్త



జలది ఉత్సవాలు దృశ్యం

మండల పరిధిలో ఆలద పల్లి గ్రామంలో వెలసిన శ్రీ కరియమ్మ దేవి, వీర అజ్జన్న పెద్ద యాత్ర ఉత్సవాలు సందర్భంగా సోమవారం జలది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణం నుండి గ్రామ సమీపంలోని వంక వరకు దేవతల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి జలది ఉత్సవాలను వేలాది భక్తుల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. . విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం నందు గ్రామ పెద్దలు మరియు ప్రజలు మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీమంత్రి సిడబ్ల్యుసి సభ్యుడు రఘువీరారెడ్డి కూడా విచ్చేసి దేవాలయం నందు విశేష పూజలు నిర్వహించారు. దేవాలయానికి సంబంధించిన అర్చకులు దేవాలయ యజమానులు ఈ కార్యక్రమం ఏర్పాట్లచేశారు. విచ్చేసిన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అవార్డు గ్రహీతలకు ఘనంగా సన్మానం

కనగానపల్లి ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలనందు సోమవారం జనవరి 26న గణతంత్ర వేడుకల్లో జిల్లా విద్యాశాఖ అధికారి నుండి అవార్డు అందుకున్న ఎంఈఓ కార్యాలయంలో సి ఆర్ ఎం టిగా పనిచేస్తున్న ఎన్. సుకన్య అలాగే మామిళ్ళపల్లి హైస్కూల్ లో పిటిఐగా పనిచేస్తున్న టి భాగ్యలక్ష్మిలకు ఎంఈఓలు అరుణమ్మ ,శ్రీదేవిల ఆధ్వర్యంలో వారికి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ఈ అవార్డు రావడానికి వారు వృత్తిని దైవంగా భావించి ఎంతో కష్టపడారని అందుకు ఫలితంగా అవార్డు రావడం జరిగిందని ఇలాగే ప్రతి ఉద్యోగి ఖచ్చితంగా పనిచేస్తే వారికి గుర్తింపు ఎప్పటికీ ఉంటుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రవికిరణ్ ఎంఈఓ కార్యాల సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో ఇసుక టిప్పర్లు

బత్తలపల్లి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



పోలిసుల అదుపులో వున్న ట్రిప్పర్లు

అక్రమంగా ఇసుక తీసుకు వెళుతున్న టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు బత్తలపల్లి ఎస్సై సోమశేఖర్ తెలిపారు. సోమవారం చిత్రావతి నది నుండి ఇసుక తీసుకు వెళుతున్న టిప్పర్ బత్తలపల్లి నుండి ధర్మవరం వైపు వెళ్ళు ఔటర్ రింగ్ రోడ్ వద్ద అనంతపురమునకు చెందిన టిప్పర్ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా చిత్రావతి నది సమీపంలోని రామాపురం వద్ద ఇసుకను అక్రమంగా తీసుకుని వెళ్ళుటకు సిద్ధంగా ఉన్న మూడు కాళీ ఇసుక టిప్పర్లను బత్తలపల్లి రెవెన్యూ సిబ్బందితో కలిసి పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇసుకను అక్రమంగా తీసుకుని వెళ్ళుటకు సిద్ధంగా ఉన్న మూడు కాళీ ఇసుక టిప్పర్లు,ఇసుక తీసుకు వెళుతున్న టిప్పర్తో పాటు నాలుగింటిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సై సోమశేఖర్,పోలీస్ సిబ్బంది ఓబులాపురం వీఆర్ఓ రాజశేఖర్,వీఆర్ఏ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవం

### ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి షష్టి వేడుకలు

అగళి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

సుబ్రహ్మణ్య స్వామి షష్టిని పురస్కరించుకుని శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవం రత్నగిరి గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగింది. వేకువ జామునుంచే సుబ్రహ్మణ్య స్వామితో పాటు అమ్మవార్లకు అభిషేకాలు, హోమం, పంచామృతాభిషేకం జరిపించడంతోపాటు బ్రాహ్మణ శాస్త్రియ బృందంచే సుబ్రహ్మణ్య స్వామి అష్టోత్తర నామావలి నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి వేడుకలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ఇతర మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. అగళికి చెందిన దివంగత సీతారామప్ప అన్నదమ్ములు, కొడుకు సుబ్బరాజు ప్రతియేటా పెద్ద ఎత్తున సుబ్రహ్మణ్య స్వామి వేడుకల సందర్భంగా అన్నదానం చేస్తారు. ఈ ఏడు కూడా ఘనంగా నిర్వహించారు. స్వామి మూల విరాట్‌ను వివిధ రకాల పూలతో అలంకరించారు. వల్లిదేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహాలను వివిధ ఆభరణాలతో అలంకరించారు. రథాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు. వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. రథోత్సవం అనంతరం మహా మంగళహారతి, తీర్థప్రసాదం పంపిణీతోపాటు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది.



వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామిని అలంకరించిన దృశ్యం

## బిసి, ఈబిసిలు 7వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు

అగళి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

ప్రభుత్వం బిసి, ఈబిసి, కాపు, వైశ్య, మైనార్టీ, కార్పోరేషన్ల రుణాల కోసం 7వ తేది వరకు దరఖాసు చేసుకోవచ్చని ఎంపిడిఓ యాదవేంద్ర తెలిపారు. ఇందులో బిసిఏకు 12 యూనిట్లు, బిసిబికు 9, బిసిడికి నాలుగు, బిసి సికి నాలుగు, కాపు కార్పోరేషన్‌కు 10, ఇబిసికి 4 మొత్తం 29 యూనిట్లు మంజూరు అయ్యాయని, నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మల్లేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం

### - మాఘమాసం మోదటి సోమవారం సందర్భంగా శిశేష పూజలు

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



రుద్రాభిషేకం అనంతరం ప్రత్యేకాలంకరణలో మల్లేశ్వరస్వామి మూలవిరాట్

పట్టణంలోని పురాతన ప్రసిద్ధ మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం మాఘమాసం పంచమి సోమవారం స్వామివారికి రుద్రాభిషేకం భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ప్రాతః కాలంలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీ లో భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి మేళతాళాల నడుమ పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఈనెల 6వ తేదీన గురువారం శివమాల అర్ధ మండల దీక్ష ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

## సీలింగ్ ఫ్యాన్ ఊడిపడి డిగ్రీ ఇంటర్న్‌షిఫ్ విద్యార్థినికు గాయాలు

### - ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్కిల్ హబ్ గదిలో క్లాస్ జరుగుతుండగా ఘటన

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



గాయపడిన ఫైనల్ బీకాం విద్యార్థిని బి.చంద్రకళ

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తరగతి గదిలోని సీలింగ్ ఫ్యాన్ ఊడి పడటంతో బి.చంద్రకళ అనే విద్యార్థిని గాయపడింది.



పైకప్పు నుండి ఊడిపడిన సీలింగ్ ఫ్యాన్

ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్న కణేకల్లు మండలం ఎన్.హనుమాపురం గ్రామానికి చెందిన బి.చంద్రకళ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో డేటా ఎంట్రీకోర్సు చేస్తోంది. రోజూ మాదిరిగానే ఉదయం స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ తరగతి గదిలో చదువుకొంటుండగా తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ రాడ్ కట్‌కావడంతో అది ఊడిపడగా ఫ్యాన్ రెక్కలు విద్యార్థిని బి.చంద్రకళ తలకు తగలడంతో గాయపడింది. దీంతోకళాశాల స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ విజయ లక్ష్మి, ప్రభుత్వ డిగ్రీకళశాల వైస్‌ప్రిన్సిపాల్ టి.మస్తానయ్య సిబ్బంది గాయపడిన విద్యార్థిని బి.చంద్రకళను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఇక్కడ వైద్యులు చికిత్స అందించి ఆమెకు ఎలాంటి ప్రమాదంలేదన్నారు. స్కిల్ హబ్ గదిలో నాశిరకమైన ఫ్యాన్లను ఏర్పాటు చేయడంతోనే ఈ ఘటన జరిగిందని తెలుస్తోంది. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశ్రఫ్ అలీ విలేఖరులతో మాట్లాడుతూ ఇది ఊహించని ఘటనని ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నామన్నారు.

## పర్యావరణ విద్య పరీక్షకి 12829 మంది విద్యార్థులు హాజరు

కొత్తచెరువు ఫిబ్రవరి 3 ప్రభాతవార్త.

శ్రీ సత్య సాయి జిల్లా జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు సోమవారం పర్యావరణ విద్య పరీక్ష నిర్వహించడం జరిగిందని డిఐఈ ఓ రఘునాథ్ రెడ్డి తెలిపారు జిల్లాలో మొత్తం 13163 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా వారిలో 12829 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు 324 మంది విద్యార్థులు గైరహాజరయ్యారు హాజరు 97.5 శాతంగా నమోదయింది స్పెషల్ ఆఫీసర్ చెన్నకేశవ ప్రసాదు జిల్లా పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యులు సురేష్ బాబు రామరాజు శ్రీనివాస్ రెడ్డి లు పరీక్ష పర్యవేక్షణ చేయడం జరిగింది ఈ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.

## నేడు 'రథసప్తమి' పర్వదిన వేడుకలు

### - విద్యుత్ దీప కాంతులతో విరాజిల్లుతున్న ప్రసిద్ధ సూర్యదేవాలయాలు - నేడు ఛాయ ఉషా సమేత సూర్యనారాయణస్వామి కళ్యాణోత్సవం

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



బూదగవి సూర్యనారాయణస్వామి ఆలయంలో కలశస్థాపన చేస్తున్న దృశ్యం

రథసప్తమి పర్వదిన వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. మండల పరిధిలోని బూదగవి గ్రామంలో వెలసిన 13 శతాబ్దం చోళరాజుల కాలం నాటి సూర్యనారాయణ స్వామి ఆలయంలోపాటు ఆమిద్యాల గ్రామంలోని సూర్యనారాయణస్వామి ఆలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబుచేసి ఛాయ ఉషా సమేత సూర్యనారాయణ స్వామి కళ్యాణోత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. బూదగవిలోని సూర్యనారాయణస్వామి ఆలయానికి జిల్లా నలుమూలల నుండే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు తెలంగాణ, కర్నాటక ప్రాంతాల నుండి వేల సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం ఉదయం ఆలయంలో నవగ్రహారాధన, కలశస్థాపన, ప్రధాన దేవతావాహన పూజ, దీక్షా హోమం, జపం, ఏకావర్తి మహాగణపతి, నవగ్రహ, మృత్యుంజయ మూలమంత్ర హోమాలు, అష్టావధాన సేవ కొనసాగింది. మంగళవారం (నేడు) షడోపచార పూజ, ఈశ్వరునికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, సూర్యునికి మహాసౌర పూర్వక అరుణ రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం సూర్యనారాయణస్వామి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. కాగా పెన్నహోబిలంలో శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి కళ్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. సాయంత్రం ఆమిద్యాల నుండి మేళతాళాల మధ్య శ్రీవారి ఉత్సవమూర్తులను పెన్నహోబిళం ఆలయానికి చేర్చారు. రాయంపల్లి గ్రామంలో వెలసిన శ్రీ పర్వతేశ్వరస్వామి ఉత్సవాలు నేటి నుండి ప్రారంభం కానుండగా నేటి అర్ధరాత్రి తరువాత (తెల్లవారుజామున) రథోత్సవం జరుగనుంది. ఆయా దేవాలయాలవద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.



ఆమిద్యాల నుండి పెన్నహోబిళం తెచ్చిన శ్రీదేవీ భూదేవి సమేత నృసింహుని ఉత్సవమూర్తులు

## కందిలో పంట కోత ప్రయోగాలు

బత్తలపల్లి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



కంది పంటలో పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్న అధికారులు

రైతులు సాగుచేసిన కంది పంటలో పంటల దిగుబడి అంచనా నిమిత్తం అధికారులు పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. సోమవారం మండలంలోని ఈదుల ముస్టూరు, సంఘాల, దంపెట్ల గ్రామాలలో ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీ నరసింహశర్మ ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈదుల ముస్టూరు గ్రామంలోని సర్వేనెంబర్ 100 2ఏ లో లక్ష్మినారాయణచౌదరి,సంగాల గ్రామము సర్వేనంబర్ 4642ఎస్ లో శంకర్ రెడ్డి, దంపెట్ల గ్రామము సర్వేనంబర్ 18డిలో పెద్దన్న సాగు చేసిన కంది పంటలలో పంటకోత ప్రయోగాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయా గ్రామాలలో ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, ఏఈఓలు ఉపేందర్ రెడ్డి, శ్రీనివాసులు పర్యవేక్షణలో వీఏఏలు నికితకుమారి, సునీత,ఎంపీఈఓ రవి నిర్వహించారు.ఈకార్యక్రమానికి ఇన్సూరెన్స్ మండలకోఆర్డినేటర్ ఎర్రిస్వామి, శ్యామ్యూల్, కృష్ణమూర్తి,మంజునాథ, మహేష్‌లు హాజరైనారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు సూర్యనారాయణ, బాబావలి, సూర్యనారాయణ, చంద్రాయుడు, రామాంజనేయులు, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు కుర్చీలు అందించిన పూర్వ విద్యార్థి

మడకశిర ఫిబ్రవరి 03 ప్రభాతవార్త:



పాఠశాలకు కుర్చీలను అందిస్తున్న పూర్వ విద్యార్థి

మడకశిర పట్టణం సదాశివాపురంకు చెందిన కనుమప్ప లక్ష్మీదేవి దంపతుల కుమార్తె కె. సునంద పూర్వ విద్యార్థిగా ఆదిరెడ్డి పాళ్యం ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక స్థాయి విద్య(2006 2010) చదువుకొన్నారు. ప్రస్తుతం కళ్యాణదుర్గం మండలంలోని సచివాలయంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈరోజు తన అక్క అలివేలమ్మ కుమార్తె మొదటి తరగతి విద్యార్థి సి.హెచ్.లాస్య పుట్టినరోజు సందర్భంగా తన వంతు సహాయార్థం నాణ్యతగల నాలుగు కుర్చీలను పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హేమలత, ఉపాధ్యాయులు ఈ.శివన్న పాఠశాల సిబ్బంది మరియు ఎస్ఎంసి సభ్యుల సమక్షంలో కె.సునంద తల్లి లక్ష్మీదేవి చేతుల మీదుగా కుర్చీలను అందుకొని పాఠశాల తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన 20 చినీ చెట్లు, డ్రిప్పు పరికరాలు

తాడిమర్రి ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త)



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న చీనీ చెట్లు, డ్రిప్ పరికరాలు

మండల పరిధిలోని చిల్లకొండయ్య పల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన ఎంటన్ లో నాగేంద్ర మరియు గురు ప్రసాద్ లకు చెందిన 20 చినీచెట్లు మరియు సుమారు 50, వేల రూపాయలు విలువచేసే డ్రిప్పు పరికరాలు కాలి బూడిద అయ్యాయి. ఆ సమయంలో పొలం వైపు వెళ్తున్న పోతలయ్య అనే రైతు చూసి సంబంధిత రైతులకు తెలియ చేయడంతో వెంటనే అప్రమత్తమైన రైతులు పొలం వద్దకు వెళ్లి మంటను అదుపులోకి తీసుకురావడం జరిగింది. లేకపోతే నష్టం భారీ స్థాయిలో జరిగి ఉండేదని రైతు చెప్పారు . డిప్పు పరికరాలు మొత్తం అగ్నిలో కాలిపోవడంతో రైతులు ఆవేదన చెందారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వంవెంటనే ఆదుకోవాలని తోటి రైతులు కోరుతున్నారు.

## హిరేతుర్పిలో శ్రీ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

గుడిబండ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:



స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని హిరేతూర్పి గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుండి ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు స్వామివారికి పూల హారతులతో మహిళలు జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. ఈ క్రమంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహించి స్వామి వారిని ఊరేగించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో చుట్టుపక్కల గ్రామస్తులతోపాటు సరిహద్దు ప్రాంతమైన కర్ణాటక నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకోండి ఎంపిడిఓ గంగాధర్

గుడిబండ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:



ఎంపిడిఓ గంగాధర్

మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు, ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేషన్ ద్వారా అందిస్తున్న సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఓ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి,కాపు,రెడ్డి తదితర కులాల వారికి రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు కోరుతోందని అర్హులైనవారు ఫిబ్రవరి 7వ తేదీ లోగా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## డిఈఓ జి.కృష్ణప్పకు ఏపీయూడబ్ల్యూజే ఆత్మీయ సత్కారం

కొత్తచెరువు ఫిబ్రవరి 3 ప్రభాతవార్త.



డీఈవో జీ కృష్ణప్ప ను సత్కరిస్తున్న జర్నలిస్టులు.

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్రీ టీ.ఎస్.చేతన్ ప్రత్యేక చొరవతో అక్రిడేషన్ కలిగిన వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థలయందు 50 శాతం రాయితీని కల్పించడం పట్ల సోమవారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు సి.పుల్లయ్య , జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బాబుల ఆధ్వర్యంలో కొత్తచెరువు జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయంలో డిఇఓ జి.కృష్ణప్ప కు ఆత్మీయ సత్కారం చేయడం జరిగింది. ఈసందర్భంగా ఆయనకు దశ్యాలువను కప్పి, పుష్పగుచ్ఛాన్ని అందించారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిఈఓ కృష్ణప్ప మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనాజర్నలిస్టుల పిల్లలకు అందించే రాయితీ విషయంలో సమస్య ఉత్పన్నమైన సత్వరమే పరిష్కారానికి చొరవ చూపాలని వారు కోరారు .అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీతో మొదటి విడతలో నమోదు కాని జర్నలిస్టుల పిల్లల యొక్క సెకండ్ లిస్టును డిఈఓ కు అందించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీఈవో తప్పకుండా తన పూర్తి సహకారం అందిస్తానని తెలియజేశారు. నిబంధన మేరకు శ్రీ సత్య సాయి జిల్లాలో విద్య అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. జర్నలిస్టులు , ఉపాధ్యాయ ,అధికార వర్గాలు పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే నాయకులు డీఈవో జి.కృష్ణప్పకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు చాపిరెడ్డి హరిప్రసాద్, డి. కేశవయ్య, ఎస్ జావీద్, డి నూర్ బాషా, సాయి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతి అయిన కంది పంట

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త



మాట్లాడుతున్న రైతు కేశవ

పుట్టపర్తి మండలం బొంతలపల్లి గ్రామ పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడం వల్ల కంది పంట అగ్నికి ఆహుతి అయిన ఘటన వెలుగు చూసింది. సోమవారం రైతు కేశవయ్య మాట్లాడుతూ 1.30 తన పొలంలో కంది పంట వేశానని అయితే చేతికి అందే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడం వల్ల కంది పంట పూర్తిగా కాలిపోయిందన్నారు. అదేవిధంగా సమీపంలో ఉన్న పశువులకు నిలువ చేసి ఉన్న గడ్డివామి సైతం కాలిపోయి బూడిదైందని పేర్కొన్నారు. అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చే లోపే పొలం నలువైపులా మంటలు చెలరేగి పంట మొత్తం పూర్తిగా దగ్ధమైందన్నారు. దాదాపుగా 10 క్వింటాళ్ల కంది బేడలు అవుతాయి అనుకుంటున్నా సమయంలో ఇలా కాలిపోయి బూడిద అయిందన్నారు. మొత్తం మీద 60 నుంచి 70 వేల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అటవీ శాఖ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకొని నాలాగా మిగతా రైతులకు ఎవరికీ నష్టం వాటిల్లకుండా చూడాలని ఆయన కోరారు. ప్రభుత్వం సంబంధిత అధికారులు తనకు న్యాయం చేసి ఆదుకోవాలని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఆత్మవిశ్వాసంతో చదివితే అద్భుత ఫలితాలు సాధ్యం

### - మున్సిపల్ కమీషనర్ నయీమ్‌అహమ్మద్

గుంతకల్లు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివితే అద్భుత ఫలితాలు సాధించగలరని మున్సిపల్ కమీషనర్ నయీమ్‌అహమ్మద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని హనుమేష్‌నగర్‌లో వున్న సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్ విద్యార్థులకు మణికంఠ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సుధాకర్‌చౌదరి, విశ్వనాథ్‌చౌదరి సహకారంతో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 10వ తరగతికి సంబంధించిన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ కమీషనర్ మాట్లాడుతూ ఉన్నత చదువుల కోసం ముందుకెళ్లడానికి 10వ తరగతి చాలా కీలకమైందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించుకోవాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో వాట్సాఫ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియాకు దూరంగా వుండాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు హరిప్రసాద్‌యాదవ్, జిల్లా కార్యదర్శి నీలకంఠ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ జ్ఞానమ్మ, ఈశ్వరమ్మ, పాల్గొన్నారు.



విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

